RNI. No. TELTEL /2022/ 89348




మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 4 సంచిక : 97 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | మంగళవారం, మార్చి, 31, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## ఏఐ వీడియోలతో అప్రమత్తం

### అస్సాం కార్యకర్తలకు మోదీ దిశానిర్దేశం



న్యూఢిల్లీ: క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాలని, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ కార్యకర్తలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం చేశారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నమో యాప్ ద్వారా 'మేరా బూత్ సబ్‌సే మజబూత్ సంవాద్' ప్రోగ్రాంలో ప్రధాని సోమవారంనాడు పాల్గొన్నారు. అస్సాంలో బీజేపీ-ఎన్డీయే మూడోసారి ఘనవిజయం సాధించేందుకు కార్యకర్తలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. కూటమికి రాష్ట్రంలో సంపూర్ణ మద్దతు ఉందని, కార్యకర్తల ఫీడ్‌బ్యాక్‌తో ప్రచారం మరింత పటిష్ఠమవుతుందని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా అస్థిరత ఉండేదని ప్రధాని అన్నారు. గత శతాబ్ద కాలంలో అనేక రంగాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు కాంగ్రెస్ హయాంలో పాలనను గుర్తించుకోవాలన్నారు. చిన్న పొరపాటు జరిగినా అస్సాం మళ్లీ వెనుక బాటపడుతుందని, నిలకడైన అభివృద్ధికి శాంతి, సుస్థిరత అనివార్యమని చెప్పారు. ఎన్నికల సమయంలో ఏఐ జనరేటెడ్ నకిలీ వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు ప్రధాని సూచించారు. తప్పుడు సమాచారం వల్ల ప్రజాస్వామ్య ప్రక్రియకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తిరుగుబాటు సంస్థలు, విద్యార్థి సంఘాలతో సురక్షితమైన ఒప్పందాలు చేసుకోవడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దాంతో ఈ ప్రాంతంలో సుదీర్ఘకాలం అశాంతి కొనసాగిందని తెలిపారు. కాగా, నియోజకవర్గాల పునర్విభజన తరువాత అస్సాంలో ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి. ప్రస్తుత అసెంబ్లీలో అధికార బీజేపీకి 64 మంది సభ్యుల బలం ఉంది. దాని భాగస్వాపక్షమైన ఏజీపీకి 9 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. యూపీపీఎల్‌కు 7, బీపీఎఫ్‌కు ముగ్గురు ఎమ్మెల్యేలున్నారు. విపక్షంలో కాంగ్రెస్‌కు 26 మంది ఎమ్మెల్యేల బలం ఉండగా, ఏఐయూడీఎఫ్‌కు 15 మంది, సీపీఎంకు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ఒక ఇండిపెండెంట్ ఎమ్మెల్యే కూడా సభలో ఉన్నారు.

### ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం... కాంగ్రెస్‌పై బీజేపీ ఎంపీ ఫైర్



న్యూఢిల్లీ, మార్చి 30: రాజ్యసభలో ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావనకు తీసుకువస్తే కాంగ్రెస్ సహా విపక్షాలు అడ్డుకున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్, అన్ని విపక్షాలు ఏకమై తన గొంతు నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఓబీసీల్లో ముస్లింలను మూకుమ్మడిగా చేరుస్తున్నారని.. ఓబీసీలు వెనకపడటానికి కారణమవుతున్నారని,ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో సహా అందరూ అడ్డుకున్నారని తెలిపారు.కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని కులంగా గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చిందని.4 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్లు ఎంపీ చెప్పారు. బెంగాల్, తమిళనాడు, కేరళ, తెలంగాణలోను ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. పోటీపడి ఒక వర్గం ఓట్ల కోసం కక్కుర్తి పడుతున్నారని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్స్ స్థానాల్లో ముస్లింలే పోటీ చేశారన్నారు. హేట్ స్పీచ్ బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే, మొదట తెలంగాణ ప్రభుత్వం అక్బరుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

### రెండు విడతల్లో


## ఏపీ, తెలంగాణలో జనగణన..



**న్యూఢిల్లీ,మార్చి,30:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రెండు విడతల్లో జనగణన జరుగుతుందని సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ తెలిపారు. ఏపీలో మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇళ్ల సర్వే జరుగుతుందని వెల్లడించారు. ఏప్రిల్ 16వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు అవకాశం ఇస్తామన్నారు. ఇక, తెలంగాణలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల సర్వే జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీ నుంచి మే 10 తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు అవకాశం ఉంటుందని అన్నారు. జనాభా లెక్కల వివరాలన్నీ గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సోమవారం సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ మీడియాతో మాట్లాడుతూ.. 'సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో ప్రజలు సొంతంగా జనాభా లెక్కల వెబ్‌సైట్‌లో ఇళ్ల సర్వే వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇళ్ల సర్వేలో ఇంటి పరిస్థితి, ఇంటి వసతులు, వస్తువులు, ఇల్లు ఎస్సీ, ఎస్టీలకు చెందినదా వంటి 34 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. తొలివిడతలో గృహాల లెక్కింపు ఉంటుంది. ప్రతీ ఇంటి పరిస్థితి, సౌకర్యాలు, ఆస్తులు తదితర వివరాలు సేకరిస్తాం. ఏప్రిల్, సెప్టెంబర్ మధ్య 30 రోజులపాటు హౌస్ లిస్టింగ్ జరుగుతుంది. హౌస్ లిస్టింగ్‌కు నెలరోజుల ముందు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు 15 రోజులపాటు అవకాశం ఉంటుంది'.. 'సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పరిస్థితుల వివరాలతో పాటు వలసలు, సంతానోత్పత్తి స్థితిగతులకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తాం. రెండో దశలో కులగణన వివరాలు సేకరిస్తాం. https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. 11,718 కోట్ల రూపాయలతో జనాభా లెక్కల సేకరణ జరుగుతోంది. 16 భాషల్లో మొబైల్ యాప్ ద్వారానే జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. ఎన్యుమరేటర్స్ సొంత మొబైల్స్ ద్వారానే జనాభా లెక్కలను సేకరిస్తారు' అని తెలిపారు.

### కువైట్ విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారంపై

## ఇరాన్ దాడులు.. భారతీయుడి మృతి



**న్యూఢిల్లీ,మార్చి,30:** పశ్చిమాసియాలో ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇప్పుడు ఇతర గల్ఫ్ దేశాలకు పెను శాపంగా మారింది. కువైట్‌లోని ఒక కీలక విద్యుత్, నీటి శుద్ధీకరణ ప్లాంట్‌పై ఇరాన్ నిర్వహించిన డ్రోన్ దాడుల్లో ఒక భారతీయ కార్మికుడు మరణించాడు. కువైట్‌లోని విద్యుత్, నీరు, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖకు చెందిన ఒక ప్రధాన ప్లాంట్‌లోని సర్వీస్ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. ఈ దాడిలో అక్కడ విధి నిర్వహణలో ఉన్న భారతీయ పౌరుడు (టెక్నీషియన్ అని తెలుస్తోంది) మరణించగా, మరికొంతమంది గాయపడినట్లు సమాచారం. డ్రోన్ నేరుగా భవనాన్ని ఢీకొనడంతో కంట్రోల్ రూం తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల కువైట్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అమెరికా తన యుద్ధనౌకలు, సైనిక బలగాలను గల్ఫ్ దేశాలలోని స్థావరాల నుంచి ఇరాన్‌పై దాడులకు ఉపయోగిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. అమెరికాకు సహకరిస్తున్న దేశాల ఆర్థిక మూలాలను.. ముఖ్యంగా విద్యుత్, నీటి ప్లాంట్లపై దాడులు చేస్తామని ఇరాన్ గతంలోనే హెచ్చరించింది. ఈ యుద్ధం ఇప్పుడు కేవలం రెండు దేశాల మధ్య కాకుండా, కువైట్, యూఏఈ, బహ్రెయిన్ వంటి దేశాలకు విస్తరిస్తోంది. పశ్చిమాసియాలో జరుగుతున్న ఈ యుద్ధంలో ఇప్పటివరకు సుమారు 8 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత గురువారం యూఏఈలో జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయుడు మరణించగా, ఇప్పుడు కువైట్‌లో మరో ప్రాణం పోయింది. గల్ఫ్ దేశాల్లో లక్షలాది మంది భారతీయులు పని చేస్తున్న నేపథ్యంలో, అక్కడి పరిస్థితులు వారి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

## ఇక కల్తీ మాఫియా ఖేల్ ఖతం..

### తెలంగాణలో ఈగల్, హైడ్రా తరహాలో మరో సరికొత్త వ్యవస్థ... రేవంత్ రెడ్డి ప్రకటన




**హైదరాబాద్,మార్చి,30:** ఈగల్, హైడ్రా తరహాలో మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మాదక ద్రవ్యాలను నిరోధించడానికి 'ఈగల్', హైదరాబాద్ నహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం 'హైడ్రా' అనే వ్యవస్థలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో ఆహార కల్తీ నియంత్రణ కోసం సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.సోమవారం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, హైడ్రా, ఈగల్ తరహాలో సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని తెలిపారు.రైతుల హక్కులను కాపాడేందుకు తాము కనీస మద్దతు ధర చట్టం తీసుకువచ్చామని గుర్తు చేశారు. పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని వాపోయారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న ఆహార భద్రతా చట్టాలను, వ్యవస్థలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని సీఎం తెలిపారు. అధ్యయనం అనంతరం, పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ మాఫియాకు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈగల్, హైడ్రా తరహాలోనే ఈ కొత్త వ్యవస్థకు కూడా విస్తృత అధికారాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించనున్నట్లు సమాచారం. రైతుల సమస్యలపైనా సీఎం స్పందించారు. పంటలకు ధర నిర్ణయించే అవకాశం రైతులకు లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. రైతుల అవసరాలను ఆసరగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. ఈ దళారీ వ్యవస్థకు చరమగీతం పాడి, రైతులకు సరైన న్యాయం చేసేందుకే తాము కనీస మద్దతు ధర (మీరా) చట్టాన్ని తీసుకువచ్చామని గుర్తు చేశారు. ఈ చట్టం రైతు హక్కులను కాపాడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడంపై కూడా సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే పెద్ద నేరమని ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే అక్రమ నిల్వదారులను వదిలిపెట్టబోమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

### పెరంబూర్‌లో నామినేషన్ వేసిన విజయ్



చెన్నై: తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీకి సోమవారంనాడు నామినేషన్ వేశారు. తూర్పు తిరుచ్చి నుంచి కూడా ఆయన పోటీలో ఉన్నారు. పెరంబూర్‌లో నామినేషన్ వేసేందుకు వచ్చిన విజయ్‌ను చూసేందుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున అక్కడకు వచ్చారు. నామినేషన్ అనంతరం పెరంబూర్‌లో ఓపెన్ టాప్ వాహనంలో ప్రచారం సాగించారు. డీఎంకే ఒక దుష్టశక్తి అని మరోసారి విజయ్ విమర్శించారు. డీఎంకే హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మాదకద్రవ్యాల బెడద ఉందని ఉన్నారు. ఈ దుస్థితికి దుష్టశక్తి డీఎంకే, స్టాలిన్ కారణమని విమర్శించారు.



# సంపాదకీయం

## పరస్పర విమర్శలతో ఒరిగేదేమిటి..?

తెలంగాణ రాజకీయాలు గమ్మత్తుగా సాగుతున్నాయి. కెసిఆర్ విమర్శలు, సిఎం రేవంత్ ప్రతి విమర్శలు జుగుప్సాకరంగా ఉన్నాయి. పరస్పర విమర్శలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రెండేళ్లు దాటినా కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతి విచారణలు, చర్యల్లో ఒక్క అడుగు కూడా పడలేదు. విచారణల పేరుతో కాలయాపన తప్ప మరోటి కానరావడం లేదు. ఏతావాతా రాజకీయ నాయకుల అవినీతిని పరస్పరం భరించే ఒప్పందాలు జరిగాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మొత్తానికి విభజన తరవాత తెలంగాణ దగా పడ్డదన్నది నిజం. అన్నింటికి మించి తెలంగాణ వ్యవహారాలను ప్రజలనుంచి దూరం చేసి మూడు పార్టీలు ఆటలాడుతు న్నాయి. కాంగ్రెస్ మీద బిఆర్ఎస్, బిఆర్ఎస్ మీద కాంగ్రెస్, ఈ రెండింటిపై బిజెపిలు విమర్శలు చేసుకోవడం పరిపటిగా మారింది. ప్రజలకు మంచి చేద్దామన్న ఆలోచన ఒక్కరికీ లేదు. రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసి, మళ్లీమళ్లీ అప్పులు చేస్తున్నారు. అవసరం లేని ఖర్చులనే ప్రస్తావిస్తున్నారు. రాజకీయంగా తామే బలంగా ఉండాలని, తామే పాలించాలన్న ఆలోచన తప్ప మరోటి కానరావడం లేదు. కెసిఆర్ హయాంలో జరిగిన అప్పుల గురించి కెసిఆర్ కూడా మాట్లాడడం లేదు. జరిగిన తప్పులు, అప్పులకు ఎవ్వరు కూడా బాధ్యత వహించడం లేదు. ఇదంతా ప్రజల ఖర్మకు వదిలేశారు. ఇకపోతే కెసిఆర్ తనయ ఇప్పుడు స్వతంత్రంగా రాజకీయాలు చేస్తున్నారు. బిఆర్ఎస్ బహిష్కరించాక ఆమెకు ఇప్పుడి ప్పుడే జ్ఞానోదయం అవుతోంది. పదేళ్ల పాలనా కాలంలో తాను నిమిత్త మాత్రురాలినని అంటున్నారు. అన్నింటికి మంచి ఆమె ఎక్కడికి వెళ్లినా సమస్యలు స్వాగతిస్తున్నాయి. ఆమె ఇవన్నీ చూసి ఆశ్చర్యంతో పాటు క్షమాపణలు చెబుతున్నారు. తనతండ్రి పదేళ్ల కాలంలో బంగారు తెలంగాణ అన్నది జరగలేదని, గుర్తిస్తున్నందుకు ప్రజలకు కూడా తెలిసి వస్తోంది. పదేళ్ల పాలనో కెసిఆర్ తెలంగాణను ఆగం చేశారని, దోపిడీ చేశారని, ఎక్కడా అభివృద్ధి జరగలేదని కవిత పర్యటనల ద్వారా నిత్యం తెలుసుకుంటున్నాం. ఆనాడు నాకు ఎలాంటి అధికారం లేదని, ఒక్క టీచర్‌ను కూడాబదిలీ చేయించుకునే అవకాశం రాలేదని వలపోస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఆమె ఇప్పుడు ఒక సంచలన నాయకురాలిగా మారారు. అయితే ఆమె ఆరోపణలు, విమర్శలు తండ్రి పార్టీని మరింతగా దెబ్బతీస్తా యన్నది నిజం. అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారుతాయన్నది కూడా అంతే నిజం. కాళేశ్వరం నుంచి కూకట్‌పల్లి భూకబ్జాల దాకా తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆమె ఒక సంచలన నాయకురాలిగా మారి పోయారు. బిఆర్ఎస్‌లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల భూదందాలు, అక్రమాలపై విరుచుకు పడుతున్న తీరుతో ఆమె ప్రజల్లో మళ్లీ కొంత సానుభూతిని పొందే ప్రయత్నాల్లో సాగుతున్నారు. అయితే లిక్కర్ స్కామ్‌తో కవిత పొలిటికల్ కెరీర్‌కు కాస్త ఇబ్బంది ఏర్పడింది. అప్పటికే కేసీఆర్ పదేండ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఇలా ఎవరికి వారు స్వార్థ రాజకీయాలకు తెలంగాణను బలి తీసుకున్నారు. అందుకేనేమో ఇప్పుడు కవిత వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి. మొదటి నుంచి కూడా పార్టీలో తనకు ప్రాధాన్యమిచ్చేవారు కాదని కవిత చెపుతోంది. ఎంపీగా ఉన్నపుడు తనను నిజామాబాద్‌కు మాత్రమే పరిమితం చేశారని చెపుతోంది. నేటి కాలంలో వారసత్వాలు లేని రాజకీయాలు నడవడం లేదు. కెసిఆర్ కూడా అందుకు అతీతుడు కాదని నిరూపించుకున్నారు. బీజేపీ, కమ్యూనిస్టులు మాత్రమే ఇందుకు భిన్నంగా ఉంటారు. కిందిస్తాయిలో ఆ పార్టీ నేతల వారసలు కూడా ఇప్పుడిప్పుడు మెల్లగా బయటకు వస్తున్నారు. భారతదేశంలో ఏ పార్టీ వారసత్వ రాజకీయాలకు అతీతం కాదు. కాకపోతే, ఒకే కుటుంబంలో కొడుకు, కూతురు, మేనల్లుడిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. తన బందు గణాన్ని కూడా తెచ్చి పెట్టుకున్నారు. తన కులం వారికి అగ్ర తాంబూలంఇచ్చారు. ఎక్కడెక్కడో ఉన్న వారిని ముందువరసలో పెట్టారు. ఇలా మొత్తం ఒకే కులం వారు గత పదేళ్లపాటు డామినేషన్ చేశారు. ఇప్పుడు అదే దెబ్బకొట్టింది. అదే అధికారాన్ని దూరం చేసింది. చివరకు కెసిఆర్‌కు వారసుల నుంచే సమస్యలు ఎదురవుతున్నాయి. కేసీఆర్ అడ్డదిడ్డంగా సంపాదించినర సంపదలో వాటా వివాదం కారణంగానే కవితను బయటకు పంపారని అంటున్నారు. సిఎం రేవంత్ రెడ్డి అయితే పదేపదే ఇదే చెబుతున్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి తమ పార్టీవారే తనను కావాలని ఓడించారని ఇప్పుడు కవిత చెపుతోంది. మంచి వక్తగా పేరున్న కవిత బాగా సంపాదించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తనకేమీ తెలియదని ఇప్పుడు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆమెను దగ్గరగా చూసిన వారు మాత్రం నిజమేమిటో తెలుసుకోగలరు. లిక్కర్ కేసు ద్వారా ప్రతిష్ట దెబ్బతిన్నదన్నది నిజం. తిరిగి పరువు కాపాడుకోవాలనే ఆరాటం కవితలో బాగా కనిపిస్తోంది. అందుకే జాగృతి జనంబాట పట్టారు. రాజకీయాల్లో అపవాదుకు గురైనపుడు, కుటుంబం దూరం పెడుతున్నపుడు, తనకు మిగిలింది రాజకీయ మార్గమే అని కవిత భావించి ఉంటుంది. ఆమె చేపట్టిన తిరుగుబాటు రాజకీయం తండ్రి పార్టీని దెబ్తీస్తుందని తెలిసినా , తన రాజకీయ ఎజెండా కోసం ఆమె దేనినీ లెక్క చేయడం లేదని కనిపిస్తోంది. కాళేశ్వరంలో జరిగిన అవినీతికి హరీశ్‌రావే కారణంగా ఆమె చేసిన విమర్శలు సంచలనంగా మారాయి. ఎవ్వరినీ వదలకుండా అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. తాను మాత్రం కడిగిన ముత్యం అని చెప్పుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. కెసిఆర్ కూతురుగా రాజకీయాల్లోకి వచ్చిన కవిత ఇప్పుడు తనకుతానుగా రాజకీయంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె ఏమేరకు విజయం సాధిస్తారన్న చూడాలి. అయితే తెలంగాణ వేదికగా రాజకీయ పార్టీలు విన్యాసం చేస్తున్నాయి. తెలంగాణ విడివడ్డ తరవాత కూడా పెద్దగా ఆశించిన ప్రయోజనం మాత్రం నెరవేరలేదు.

## ఖని 1 టౌన్ ఎస్ఐ మనోహర్ ఆధ్వర్యంలో అరైవ్ -- అలైవ్ -- 2026" ఫేజ్-3లో భాగంగా ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వుల మేరకు, "అరైవ్ -- అలైవ్ -- 2026" ఫేజ్-3 కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు గోదావరిఖని 1 టౌన్ పోలీస్ పరిధిలో నీ ఆటో డ్రైవర్స్ కి గోదావరిఖని 1 టౌన్ ఎస్ఐ మనోహర్ ఆధ్వర్యంలో, దుర్గ ప్రసాద్ నేత్రాలయంలో ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడింది. ఈ శిబిరంలో ఎక్కువ సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ, డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు చాలా ముఖ్యమని, కంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో డ్రైవర్ల ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆటో?డ్రైవర్స్, ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని పోలీస్ కోరారు.

## జి.ఎం. కాలనీలో మహిళలకు ఉచిత శిక్షణ, కార్పొరేటర్ వేగోళపు రమాదేవి శ్రీనివాస్ సర్టిఫికెట్ల ప్రదానం

### అనుదీప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ బుట్టలు, అల్లికల శిక్షణ

తెలంగాణ అవతరణ, మార్కండేయ కాలనీ,( మార్చ్ 30): గోదావరిఖని స్థానిక 7వ డివిజన్ జి.ఎం. కాలనీలో శ్రీ సూరపనేని అనుదీప్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణా కేంద్రం ముగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. మహిళలకు ప్లాస్టిక్ బుట్టలు, అల్లికలు వంటి నైపుణ్యాలను నేర్పించి ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను 7వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి వేగోళపు రమాదేవి గంగ శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మహిళలు స్వయం సమృద్ధి చెందడానికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, వాటి ద్వారా వారు ఆర్థికంగా స్థిరపడటమే కాకుండా కుటుంబానికి ఆధారమవుతారని అన్నారు. అనుదీప్ ట్రస్ట్ చేపట్టిన ఈ కార్యక్రమం మహిళా సాధికారతకు మరో మెట్టు అని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో



అనుదీప్ ట్రస్ట్ చైర్మన్ శశికళ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల పోషం, జంగిలి రాజేష్, జనగామ వినోద్, తాటికొండ అంజన్న, రాజు, నాగరాజు, సంజీవ్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కోల్ బెల్ట్ ప్రతిభావంతులకు నల్లవజ్రం కీర్తి పురస్కారాలు పందిల్ల శ్యాం సుందర్, కెఎస్ వాసు







(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) సింగరేణి కోల్ బెల్ట్ ప్రాంతంలో పలు రంగాలలో ప్రతిభావంతులను గుర్తించి హైదరాబాద్ తారా ఆర్ట్స్ అకాడెమీ నల్లవజ్రం కీర్తి పురస్కారం, ఉగాది పురస్కారాలను అందజేయడం ప్రశంసనీయమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్ ను అతిథులు అభినందించారు. తారా ఆర్ట్స్ అకాడెమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి, ఆదివారం స్థానిక మార్కండేయ కాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉగాది కళోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరైన ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సినీ సంగీత దర్శకులు ఘంటాడి కృష్ణ, ఎన్సీపీ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ మేకల శ్రీధర్ యాదవ్, సాంస్కృతిక సారథి రాష్ట్ర బాధ్యులు అంతడుపుల నాగరాజు, టివీ డ్యాన్సర్ వర్షిణీ, ఇతర అతిథులు మాట్లాడారు. ప్రతి రంగంలోనూ విశేష సేవలందిస్తున్న వారు తమ సేవలకు గుర్తింపుగా ఒక చిన్న ప్రశంస కోరుకోవడం సహజమని, రాష్ట్ర వ్యాప్తంగా కోల్ బెల్ట్ విస్తరించి ఉన్న ప్రాంతాలలో సింగరేణి సంస్థతో బంధం, అనుబంధం ఉన్న కవులు, కళాకారులు, రచయితలు, క్రీడాకారులు, పాత్రికేయులు, వైద్యులు, న్యాయవాదులు, తదితర రంగాలవారికి అవార్డులు అందజేయడం ప్రశంసనీయమన్నారు. దేశ, విదేశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తారా ఆర్ట్స్ అకాడెమీ గోదావరిఖని వేదికగా 2021, 2023, 2026 లో కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. కాగా కార్యక్రమానికి ముందు అతిథులు, పురస్కార గ్రహీతలకు నిర్వాహకులు మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు సంకె రాజేష్ అధ్యక్షత వహించగా, పలు రంగాలకు చెందిన ఈద రాంచందర్, పందిల్ల శ్యాం సుందర్, కెఎస్ వాసు, డాక్టర్ జి.రమేష్ బాబు, డొంకెన రవి, శ్రీనిధి, జి.మోహన్, బోడకుంట వెంకటరాజం, తిప్పబత్తిని అంజయ్య, గంధం శ్రీనివాస్, కొమ్ము అశోక్ తదితరులకు నల్ల వజ్రం కీర్తి పురస్కారం, ఉగాది పురస్కారాలను అందజేశారు. అనంతరం ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఘంటాడి కృష్ణ సంగీత విభావరి, కళాకారుల నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఇంకా ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు కవ్వంపల్లి స్వామి, దామెర శంకర్, మేజిక్ రాజా, దయా నర్సింగ్, చంద్రపాల్, చీకటి అంజయ్య, కనకం రమణయ్య, చల్లా ప్రవీణ్, గజెల్లి రాజలింగు, పెద్దుల్ల శ్రీనివాస్, నర్సయ్య, పలు జిల్లాలకు చెందిన పురస్కార, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు

## నామినేషన్ వేసిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంటోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సోమవారంనాడు తన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన కొలతూర్ నియోజకవర్గంలో రోడ్‌షోలో పాల్గొన్నారు. మూడుసార్లు కొలతూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన స్టాలిన్ మరోసారి తన అదృష్టాన్ని ఇక్కడి నుంచే పరీక్షించుకుంటున్నారు. డీఎంకే, సెక్యూలర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ అభ్యర్థిగా తనకు కొలతూర్ నియోజకవర్గం ప్రజలు మరోసారి భారీ విజయాన్ని అందించనున్నారని నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్టాలిన్ చెప్పారు. ఈ విషయంలో తాను చాలా గట్టి నమ్మకంతో ఉన్నానని అన్నారు. ఎప్పటిలాగానే ఈసారి కూడా తమ ప్రచారం చాలా బలంగా ఉ ంటుందని తెలిపారు. డీఎంకే ఈ ఎన్నికల్లో 234 నియోజకవర్గాలకు గాను 164 చోట్ల పోటీ చేస్తోంది. భాగస్వామ్య పక్షాలు 70 స్థానాల్లో పోటీలో ఉన్నాయి. వీటిలో కాంగ్రెస్ 28 స్థానాల్లో, సీపీఎం 5, సీపీఎం (మార్క్సిస్ట్) 5, వీసీకే 8, ఎండీఎంకే 4 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. డీఎండీకే సహా ఇతర చిన్న పార్టీలు 10 సీట్లలో పోటీలో ఉన్నాయి.

## హిందూ మతాన్ని, ఆలయాలను ప్రధాని మోదీ పట్టించుకోరు: రాహుల్ గాంధీ



పాతానమిట్ట: కేరళలో ఏప్రిల్ 9వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ పాతానమిట్టలో జరిగిన సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీమాట్లాడారు. కేరళ పర్యటన వేళ శబరిమల అంశంపై ప్రధాని మోదీమౌనంగా ఉన్నారని ఆరోపించారు. దీని అర్థం బీజేపీ-ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదూర్‌లో జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లో ప్రసంగిస్తూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐఎం, బీజేపీ పార్టీలను సంయుక్తంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. తమ పార్టీ ఎల్డీఎఫ్ తో పోటీపడుతోందని, కానీ ఆ పార్టీకి బీజేపీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. బీజేపీతో ఎవరు పోరాడినా, వారిపై బీజేపీ అటాక్ చేస్తుందని, తనపై అటాక్ జరిగిందని, నాపై 36 కేసులు ఉన్నాయని, 55 గంటల పాటు నిర్విరామంగా తనను ప్రశ్నించారన్నారు. అయితే కేరళ సీఎం పినరయి విజయన్‌పై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఎల్డీఎఫ్ నాయకత్వం చాలా భ్రష్టుపట్టిందని, ఆ పార్టీ నేతలపై కేసులు ఉన్నాయని, కానీ బీజేపీ నుంచి వారిపై వత్తిడి లేదని, దర్యాప్తులు జరగడం లేదని, వాళ్లకు బెదిరింపులు కూడా లేవని రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోదీ ఎక్కడకు వెళ్లినా.. ఆలయాల గురించి మతం గురించి మాట్లాడుతారని, కానీ పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల అంశాన్ని లేవనెత్తలేద న్నారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి లెఫ్ట్ ఫ్రంట్ నేతలు బంగారాన్ని దోచుకెళ్లిన విషయాన్ని ప్రధాని మరిచిపోయారని రాహుల్ అన్నారు. బంగారాన్ని ఎత్తుకెళ్లిన లెఫ్ట్ ఫ్రంట్ నేతలు.. దాన్ని ఇత్తడితో నింపేశారని ఆరోపించారు.

## అంజన్న సన్నిధిలో అద్భుతం.. హనుమంతుడికి పూజలు చేసిన వానరం..

హనుమంతుడి ఆలయంలో అద్భుతం జరిగింది. ఓ వానరం నేరుగా అంజన్న గుడిలోకి వచ్చి పూజలు చేసింది. ఈ ఘటన కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. దహెగాం మండలం కేంద్రంలోని ఓ రామాలయంలో హనుమాన్ విగ్రహానికి స్వాముల పూజలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఓ మర్కటం ప్రవేశించింది. హనమయ్యకు మంగళ హారతి ఇచ్చేంత వరకు అక్కడే శ్రద్ధగా కూర్చొని పూజలను వీక్షించింది. హారతి అనంతరం.. వాయుపుత్రుడి విగ్రహం వద్దకు వెళ్లి మొక్కింది. అంతటితో ఆగలేదు. స్వామివారికి సమర్పించి తీర్థాన్ని తనివితీరా తాగి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ తతంగాన్ని హనుమాన్ దీక్ష దారులు అక్కడే ఉండి వీక్షించారు. ఆ బజరంగబలే వానర రూపంలో వచ్చి తమకు దర్శన మిచ్చారని మాలాధారులు సంతోషం వ్యక్తం చేశారు. హనుమంతుడు వాయుదేవుడు, అంజనాదేవిల కుమారుడు. శివుని అంశతో జన్మించిన వానర దేవుడు. రామాయణంలో రాముడికి అత్యంత భక్తుడిగా, రాక్షస సంహారంలో కీలక పాత్ర పోషించిన హనుమంతుడు, శారీరక బలం, తెలివితేటలు, భక్తికి ప్రతీకగా నిలుస్తాడు. నమ్మినవారికి నేనున్నానంటూ వరాలు ఇచ్చే దేవుడు అభయాంజనేయుడు. శ్రీరాముడిని నమ్మిన భక్త ఆంజనేయుడు. సిందూర ప్రియుడు. ఒక్కసారి మాలధరించి 'అంజన్నా.. అని పిలిస్తే' పలుకుతాడనే నమ్మకం.





# సింగరేణిలో మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలి

# లేకుంటే ప్రజాభవన్ ముట్టడిస్తాం

## టిబిజికెస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి

## -ఆర్ జీవన్ ఉపాధ్యక్షులు వద్దేపల్లి శంకర్ ఆధ్వర్యంలో







(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) సింగరేణిలో మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలని పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణిలో అవినీతిని అరికట్టాలని నిరసిస్తూబి తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆర్జీ వన్ ఏరియా జయం ఆఫీస్ ముందు జరిగిన ధర్నా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ధర్నా కార్యక్రమంలో మిర్యాల రాజిరెడ్డి హాజరై మాట్లాడారు.గతంలో గోల్డెన్ హ్యాండ్ షేక్ పేరు మీద 20 వేల మందిని డిస్మిస్ పేరిట పదివేల మందిని తొలగించిన నాటి ప్రభుత్వాలు. ప్రస్తుతం అదే పోకడ కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంబిసింగరేణిలో అవినీతి రాజ్యమేలుతుందని కారుణ్య నియమాకాల ద్వారా నియమితులైన ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఉద్యోగుల పైన ఏసీబీ విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరింపులకు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు గురి చేయడం దారుణమని ఈ పద్ధతి వెంటనే మానుకోవాలని తెలిపారుబిఅవినీతి విచారణ చేయాల్సింది ఉద్యోగుల పైన కాదని బొగ్గు గనుల కోసం తాపత్రయపడే మంత్రుల పైన ఏసీబీ విజిలెన్స్ విచారణ చేయాలని ఆయన పేర్కొన్నారుబిబిఅనారోగ్యంతో ఉన్న ఉద్యోగులను మెడికల్ బోర్డుకు పిలవకుండా మెడికల్ బోర్డు నిలిపి వేసె ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం మరియు అధికారులు కలిసి చేస్తున్నారని వారు పేర్కొన్నారుబికాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మార్పు వస్తుంది నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని కార్మికులను మభ్యపెట్టి కార్మికుల నెత్తిపై భస్మా హస్తం పెట్టారని ఇప్పటికైనా కార్మికులందరూ అర్థం చేసుకోవాలని పేర్కొన్నారుబి2000 మంది కార్మికుల సింగరేణి వ్యాప్తంగా అనారోగ్యంతో గత 10 నెలల సర్వీస్ ఉన్నవారు గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు కొరకు వేచి చూస్తున్నారని పేర్కొన్నారుబినిర్వహించరా నిర్వహిస్తే ఏ రకంగా ఉంటుందో అని కూడా అర్థం కావట్లేదనిబి
రెగ్యులర్ మెడికల్ బోర్డు లేక అనేకమంది కార్మికులు దీర్ఘకాలిక రోగాలతో అవస్థలు పడుతున్నారని . ఏసిబి విజిలెన్స పేరిట కాలయాపన చేస్తున్నారని సింగరేణి కార్మిక వర్గమంతా ఆలోచించాలని పేర్కొన్నారుబి
సంస్థలో జరుగుతున్న అవినీతి అక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుంభకోణాల పైన సంస్థ నిధుల దుర్వినియోగం పైనబిసింగరేణి కార్మిక వర్గమంతా మేల్కొనాలని పోరాటాలకు సిద్ధం కావాలని సంస్థను పరిరక్షించుకోవాలని అందుకు తగిన పోరాటాలతో పాటుబిసింగరేణి భవన్ ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి కార్మికులందరూ కూడా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఆర్ జీవన్ ఉపాధ్యక్షులు వద్దేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య
కోశాదికారి చెల్పూరి సతీష్.బిజావిద్ పాషా పోలాడి శ్రీనివాసరావు చల్లా రవీందర్ రెడ్డి మొదుంపల్లి రాజేషం బిచిలకలపల్లి శ్రీనివాస్ దూట శేషగిరి కొండ్రా అంజయ్య ఉప్పులేటి తిరుపతి జనగామ మల్లేష్ పులిపాక శంకర్ అడ్డగట్ల గోపి మీస రాజు నరేష్ రహమాన్ పుప్పాల రవీందర్ దిద్ది లక్ష్మణ్ మురళీకృష్ణ పర్లపల్లి అభిషేక్ అంబటి శ్రీనివాస్ వంశీ నాగరాజు పిడుగు సతీష్ రాజ్ కుమార్ వెంకట్ రెడ్డి కరట రాములు మల్లారెడ్డి రామచందర్ అనురాజ్ నుతి రాజ్ కుమార్ చంద్రు శ్రీనివాస్ ఆరిఫ్ దండే యశ్వంత్ భాస్కర్ అక్షిత్ పోషం రాజలింగు రవి కుమార్ స్వామి బుఖ్య రాజ్ కుమార్ రామ్మూర్తిబికుమారస్వామి కూన రవి సార్ల పోషం తిరుపతి అధిక సంఖ్యలో టీబీజీకేస్ శ్రేణులు పాల్గొన్నారు.

# కళాకారులు చరిత్ర, సంస్కృతి-సాంప్రదాయాలను ముందు తరాలకు అందించే వారధులు

## జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు వద్దేపల్లి రాంచందర్






(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) కళాకారులు చరిత్ర, సంస్కృతి-సాంప్రదాయాలను ముందు తరాలకు అందించే వారధులని జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు వద్దేపల్లి రాంచందర్, రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. తారా ఆర్ట్స్ అకాడెమీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక మార్కండేయ కాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉగాది కళోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరై విభిన్న రంగాలలో విశేష సేవలందిస్తున్న ఎంపిక చేయబడిన ప్రతిభావంతులకు ఉగాది, నల్లవజ్రం పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వద్దేపల్లి రాంచందర్ మాట్లాడుతూ కళలు, సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తాయని అన్నారు. మన ప్రాంతంలో కళాకారులకు కొదవలేదని, పలు కళలలో నిష్ణాతులైన జాతీయ, అంతర్జాతీయ స్థాయి కళాకారులు మన పారిశ్రామిక ప్రాంతంలో ఉన్నారన్నారు. శాస్త్రీయ సంగీతం, నృత్యాలు సంస్కారవంతంగా ఉంటాయని, వాటిపట్ల ఆసక్తి కలిగేలా కళాకారులను, పిల్లలను ప్రోత్సహించాలన్నారు. మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరచి, ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో కళాకారుల ఆట, పాట, మాట కీలక భూమిక పోషించాయన్నారు. ఈ ప్రాంతంలో కళాకారులకు కొదవలేదని, వారి ప్రదర్శనలకు వేదికలేక దాదాపు ఇరవై, ఇరవై ఐదు సంవత్సరాలుగా కళాకారులు ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ ను ఆశ్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2004లో నాటి మున్సిపల్ చైర్మన్ దివంగత బడికెల రాజలింగం హయాంలో కళాభవన్ నిర్మాణానికి బీజం పడినప్పటికీ, అది నేటికీ పూర్తి కాలేదన్నారు. ఈ ప్రాంతంలో కళాభవన్ నిర్మించాలన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సంకల్పంతో రెండు సంవత్సరాలలో అధునాతన కళాభవన్ ను నిర్మించి కళాకారులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ వచ్చాయన్నారు. ఖాళీ అవుతున్న రామగుండం, గోదావరిఖని నగరాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కృషి చేస్తున్నారని, 800 మెగావాట్ల కొత్త పవర్ ప్రాజెక్టు కు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. వేలకోట్ల రూపాయల నిధులను తీసుకువచ్చి, రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కు ప్రజలంతా సహకరించాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతానికి చుట్టూతా ఉన్న పరిశ్రమలతో నగరం కాలుష్యమయంగా మారుతోందని, ఆ కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛ రామగుండంగా మార్చడం కోసం మొక్కలు నాటాలన్నారు. మన ఇల్లును శుభ్రంగా ఉంచుకున్నట్లు నగరాన్ని కూడా స్వచ్ఛంగా ఉంచాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో పుట్టి పెరిగి, జాతీయ, అంతర్జాతీయ స్థాయికెదిగిన సంకె రాజేష్ మన ప్రాంతంలో విభిన్న రంగాలలో రాణిస్తున్న ప్రతిభావంతులకు ఉగాది, నల్లవజ్రం పురస్కారాలు ప్రదానం చేయడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. సంస్థ అధ్యక్షులు సంకె రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు దాసరి సాంబమూర్తి, చక్రపాణి, ఏఆర్ ఏసీపీ చల్లా ప్రతాప్, సాంస్కృతిక సారథి రాష్ట్ర సలహా మండలి సభ్యులు అంతడ్పుల నాగరాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకన రవి, ఎన్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్, సినీ నిర్మాత, దర్శకులు నరేష్ వర్మ, ఆర్జీ వన్ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, నిర్వహణ కమిటీ సభ్యులు కవ్వంపల్లి స్వామి, దామెర శంకర్, మేజిక్ రాజా, దయా నర్సింగ్, చంద్రపాల్, చీకటి అంజయ్య, గజెల్లి రాజలింగు, పెద్దుల్ల శ్రీనివాస్, తూము నర్సయ్య, పలు జిల్లాలకు చెందిన పురస్కార, అవార్డు గ్రహీతలు పాల్గొనగా, కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.

# స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమ ర్యాంక్ సాధించడమే ధ్యేయం

## - రామగుండం మేయర్ మహంకాళి



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 30: స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఉత్తమ ర్యాంక్ సాధించడమే తమ ధ్యేయమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. మునిసిపల్ కార్యాలయం నుండి ఫైవ్ ఇంక్ లైన్ వరకు ప్రదాన రహదారి ని స్వీపింగ్ యంత్రంతో శుభ్ర పరిచే పనులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ వద్ద ఉన్న స్వీపింగ్ యంత్రం చెడిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఎం ఎల్ ఎ సహకారంతో హెచ్ కె ఆర్ సంస్థ నుండి తెప్పించి శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. నగర పాలక సంస్థ వద్ద పారిశుద్ధ్య సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రదాన రహదారులను శుభ్రం చేయడానికి తక్కువ ఖర్చుతో పని చేసే ట్రాక్టర్ మౌంటెడ్ స్వీపింగ్ యంత్రాలు తెప్పించడానికి చర్యలు తీసుకోవలసిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రామగుండం నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడశీ పాలక వర్గం తమ భాద్యతగా భావించి పని చేస్తున్నందున ప్రజలు కూడా సహకరించి చెత్త బయట పడవేయకుండా మునిసిపల్ వాహనానికి ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ సంధర్భంగా నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వి. రామన్, టి పి ఎస్ నవీన్ , సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.


# రామగుండం మేయర్ మోరీల బాట

## - చక చక మోరీలను శుభ్రం చేయుస్తున్న మహంకాళి స్వామి



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 30:రామగుండం మేయర్ మోరీల బాట పట్టారు. మురుగును శుభ్రం చేయించే పనులను దగ్గరుండి స్పీడప్ చేయూస్తున్నారు. ప్రజల మన్ననలు పొందుతున్నారు. నగర సుందరీకరణే లక్ష్యంగా మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించే పనిలో రామగుండం నగర నగర మేయర్ మహంకాళి స్వామి నిమగ్నమయ్యారు. శనివారం నీటి సరఫరా పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తు పైప్ లైన్ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ పూర్తి చేయించిన మేయర్ అదే తరహాలో మురుగు నీటి కాలువలో పూడిక తొలగింపు పనులను కూడా పర్యవేక్షిస్తున్నారు. సోమవారం తెల్లవారు జామునునే కార్యరంగం లోకి దిగారు . నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రదాన రహదారి వెంబడి పారుతున్న పెద్ద మురుగు నీటి కాలువలో జె సి బి యంత్రం సహాయంతో పూడిక తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. క్షేత్ర స్థాయిలో దగ్గరుండి సిబ్బందికి మార్గదర్శనం చేస్తూ కాలువ శుభ్రం చేయించారు. తొలగించిన పూడికను కూడా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా తరలించే ఏర్పాట్లు చేయించారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన పూడికను తొలగించడంలో కాలువ సాఫీగా ప్రవహిస్తున్నది.

# మేలో అదిరిపోయే ఎండలు-రుతుపవనాల ఆలస్యం!




**హైదరాబాద్,మార్చి,30:** ఈ ఏడాది అంతర్జాతీయంగా 'ఎల్-నినో' పరిస్థితులు బలపడుతుండటంతో, భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దీని ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం ప్రధానంగా 2023 నాటి తీవ్ర పరిస్థితులను గుర్తుకు తెచ్చేలా ఉంటుందని, వేసవి కాలం రెండు దశల్లో తన ప్రభావాన్ని చూపుతుందని అంచనా వేస్తున్నారు. వేసవి కాలం మొదటి భాగం, అంటే ఏప్రిల్ నెలాఖరు వరకు, వాతావరణం కొంత భిన్నంగా ఉండబోతోంది. సాధారణంగా వేసవి ప్రారంభంలో ఉండాల్సిన ఎండల కంటే, ఈ కాలంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటికే మార్చి నెలలో మనం చూస్తున్నట్లుగా, క్రమం తప్పకుండా వర్షాలు కురవడం వల్ల ఏప్రిల్ వరకు ఉష్ణోగ్రతలు నియంత్రణలోనే ఉంటాయి. దీనివల్ల సాధారణ వేసవి తాపం కంటే తక్కువ వేడి నమోదయ్యే అవకాశం ఉంది. ఈ వర్షాలు తాత్కాలికంగా ఉపశమనాన్ని ఇచ్చినప్పటికీ, ఇవి అస్థిరమైన వాతావరణానికి సంకేతాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అసలైన వేసవి రెండో భాగంలో ఎదురుకానుంది. మే నెల నుండి జూన్ మధ్య వరకు వాతావరణం పూర్తిగా పొడిగా మారిపోతుంది. ఈ సమయంలో 'మాసివ్ హీట్‌వేవ్స్' వీచే అవకాశం ఉంది. ఎల్-నినో ప్రభావం వల్ల భూమిపై వేడి విపరీతంగా పెరిగి, ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకోవచ్చు. ముఖ్యంగా పగటిపూట నిప్పులు చెరిగే ఎండలతో పాటు, రాత్రిపూట కూడా వేడి గాలి వీయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ దశలో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఇది ఆరోగ్యానికి మరియు వ్యవసాయానికి సవాలుగా మారుతుందని వాతావరణ శాఖహెచ్చరిస్తోంది. అలాగే ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం అయ్యేలా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకాల్సిన రుతుపవనాలు, ఎల్-నినో వల్ల జూన్ రెండో వారం లేదా ఆ తర్వాతే వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల వేసవి కాలం మరింత సుదీర్ఘంగా కొనసాగుతుంది. ఈ పరిణామం వల్ల జూన్ నెలలో కూడా ఎండల తీవ్రత తగ్గకపోవడమే

# సన్నబియ్యం క్రెడిట్ సీఎం రేవంత్‌దే:ఉత్తమ్



**హైదరాబాద్,మార్చి,30:** రాష్ట్రంలో అమలవుతున్న ప్రతిష్టాత్మక సన్నబియ్యం పథకంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన అసెంబ్లీ వద్ద మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలనే ఈ అద్భుతమైన ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి దేనని, ఆ ఘనత పూర్తిగా ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ప్రభుత్వానికి ఎంత ఆర్థిక భారమైనా సరే పేద ప్రజలు గౌరవంగా, కడుపునిండా భోజనం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని మంత్రి స్పష్టం చేశారు. సన్నబియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం ఏటా రూ.14,560 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. గతంలో తమ అధినేత్రి సోనియా గాంధీ తీసుకొచ్చిన ఫుడ్ సెక్యూరిటీ బిల్లు ఆశయాలకు తెలంగాణలో పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతోందని ఉత్తమ్ అన్నారు. రాష్ట్రంలోని సుమారు 3 కోట్ల 39 లక్షల మంది సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని మంత్రి ఉత్తమ్ వివరించారు. అర్హులైన వారు ఎవరైనా సరే, రాజకీయాలకు అతీతంగా కొత్త రేషన్ కార్డులు (=ఛ్అశీఅ ఝుతీశం) మంజూరు చేస్తున్నామని తెలిపారు. అడిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా








మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈసినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్– త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ.1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్టీ సర్కిల్స్ లో వినిపించింది. త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎం దుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ – త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

## ప్రెగ్నెన్సీ పుకార్లపై అవికా గోర్ ఫైర్..

# నిజం ఇదే అంటూ క్లారిటీ ఇచ్చిన నటి



సోషల్ మీడియాలో తన గురించి వైరల్ అవుతున్న ప్రెగ్నెన్సీ వార్తలపై నటి అవికా గోర్ గట్టిగా స్పందించింది. ఎలాంటి ఆధారం లేకుండా తన వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారాలు చేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేసింది. నెటిజన్లలో చక్కర్లు కొడుతు న్న ఈ రూమర్స్‌లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసిన అవికా, ఇలాంటి నిరాధార వార్తలను నమ్మవద్దని అభిమానులను కోరింది. ఈ సందర్భంగా అవికా మాట్లాడుతూ, "నా గురించి వస్తున్న ప్రెగ్నెన్సీ రూమర్స్ అన్నీ పూర్తిగా ఫేక్. అలాంటిదేమీ జరగలేదు. దయచేసి అబద్ధపు వార్తలను నమ్మకండి" అంటూ స్పష్టమైన క్లారిటీ ఇచ్చింది.

అయితే అదే సమయంలో ఆమె మరో ఆసక్తికర వ్యాఖ్య చేసింది. "ఇంకో నిజమైన వార్త మాత్రం ఉంది. అది ఏంటో త్వరలోనే అందరితో పంచుకుంటాం" అని చెప్పడంతో, ఆమె నుంచి రాబోయే గుడ్ న్యూస్ ఏంటన్న ఆసక్తి ఒక్కసారిగా పెరిగింది. ఈ కామెంట్స్‌తో సోషల్ మీడియాలో మరోసారి చర్చ మొదలైంది. టెలివిజన్ రంగం నుంచి సినిమా ఇండస్ట్రీకి విజయవంతంగా అడుగుపెట్టిన అవికా గోర్, తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇటీవల ఆమె వ్యక్తిగత జీవితం కూడా వార్తల్లో నిలుస్తోంది. 2025లో తన దీర్ఘకాల బాయ్‌ఫ్రెండ్ మిలింద్ చాంద్వానితో అవికా వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో ఒక స్నేహితుడి పార్టీ సందర్భంగా పరిచయం అయిన వీరి స్నేహం క్రమంగా ప్రేమగా మారింది. జూన్ 2025లో నిశ్చితార్థం చేసుకున్న ఈ జంట, ఆ తర్వాత తమ బంధాన్ని మరింత బలపర్చుకుంది. ఇద్దరూ కలిసి 'పతి పత్నీ ఔర్ పంగా' అనే షోలో పాల్గొనడం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఆ షో సెట్స్‌లోనే వీరు వివాహం చేసుకోవడం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీసింది. పెళ్లి తర్వాత కూడా అవికా తన కెరీర్‌పై పూర్తి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రెగ్నెన్సీ పుకార్లకు ఫుల్ స్టాప్ పెట్టిన అవికా, తాను త్వరలో చెప్పబోయే మరో నిజమైన వార్త ఏమిటన్న దానిపై అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఆ గుడ్ న్యూస్ ప్రొఫెషనల్ జీవితానికి సంబంధించినదా? లేక వ్యక్తిగత జీవితానికి సంబంధించినదా? అన్నది తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

# కమిటీ కుర్రోళ్లు డైరెక్టర్‌తో మెగా ప్రిన్స్ సినిమా..?







మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ప్రస్తుతం మంచి హిట్ కోసం కష్టపడుతున్నారు. ఇందులో భాగంగా ఆయన నటిస్తున్న లేటెస్ట్ హారర్ కామెడీ జానర్ ఎంటర్టైనర్ మూవీ 'కొరియన్ కనకరాజు'.
మేర్లపాకగాం తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో యంగ్ బ్యూటీ రీతికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే, సీనియర్ నటి తులసి, సత్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ సంస్థలు భారీ స్థాయిలో సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మ్యూజిక్ లెజెండ్ తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో వచ్చిన 'తొలిప్రేమ' మంచి మ్యూజి కల్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ మూవీపై భారీ హైప్ క్రియేట్ అవుతోంది.ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా సాగుతుండగా... ఈ స మ్మర్‌కు సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. గత కొంతకాలంగా వరుణ్ తేజ్ ఖాతాలో సరైన హిట్ పడలేదు. ఈ మూవీతోనైనా మంచి హిట్ కొట్టాలని అంతా భావిస్తున్నారు. ఈ క్రమంలో మరో న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది, వివరాల్లోకి వెళితే.. కొరియన్ కనకరాజు సినిమా పూర్తయిన తర్వాత నిహారిక నిర్మాణంలో సినిమా చేసే
అవకాశాలు ఉన్నాయి. వరుణ్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసిన నిహారిక మొదట వెబ్ సిరీస్‌లు ప్రొడ్యూస్ చేశారు. 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో వెండితెరపైకి నిర్మాతగా అడుగుపెట్టారు. అది మంచి విజయం సాధించింది.

# రెండో పెళ్లిపై లోకేష్ కనగరాజ్ రియాక్షన్..

**కోలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. యంగ్ హీరోలతో, స్టార్స్‌తో భారీ ప్రాజెక్ట్స్ తెరకెక్కిస్తూ.. తీరిక లేకుండా గడుపుతున్నారు. చేసినవి కొన్ని సినిమాలే అయినా, బాక్సాఫీస్ దగ్గర వందల కోట్లు కొల్లగొడుతూ పాన్ ఇండియా లెవల్లో పాపులర్ అయ్యారు. తమిళ హీరోలతోనే కాకుండా పాన్ ఇండియా హీరోలతో కూడా సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో 'AA-23' వంటి భారీ ప్రాజెక్ట్‌లు ప్లాన్ చేస్తూ బిజీగా ఉన్న లోకేష్, తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టారు. గత కొద్దికాలంగా లోకేష్ ఒక స్టార్ హీరోయిన్‌తో ప్రేమలో ఉన్నారని, త్వరలోనే ఆమెను పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. తాజాగా, ఓ ఈవెంట్‌లో పాల్గొన్న లోకేష్ స్పందించి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దీనిపై ఒక ఈవెంట్‌లో యాంకర్ ప్రశ్నించగా.. లోకేష్ తనదైన శైలిలో స్పందించారు. "నా మీద చాలా రూమర్స్ వచ్చాయి, కేవలం ఒక హీరోయిన్‌తోనే కాదు, చాలామందితో ముడిపెట్టారు. నాకు ఇప్పటికే ఒక కుటుంబం ఉంది. నేను ఫ్యామిలీ మ్యాన్‌ని" అని క్లారిటీ ఇచ్చారు. అయితే యాంకర్ కొంచెం ఎగతాళిగా 'మరి రెండో ఫ్యామిలీ ఆలోచన లేదా?' అని అడగ్గా, లోకేష్ సీరియస్‌గా "నేను సమాధానం చెప్పను" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయారు.**



# భారతదేశంలోని గొప్ప నటీమణుల్లో ఆమె ఒకరు

రణ్‌భీర్ కపూర్ తన ఇష్టమైన నటి రాణీ ముఖర్జీ 30 వసంతాల ప్రస్థానాన్ని సెలబ్రేట్ చేయటానికి భారతీయ సినీ పరిశ్రమ కలిసి ముందుకు రావటం చూసి చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రణ్‌భీర్ కపూర్ మాట్లాడుతూ "రాణీ ముఖర్జీ సావరియా చిత్రంలో నాతో కలిసి నటించారు. నేనెంతో కష్టపడి నటించానని నాకు చెప్పి ప్రోత్సహించిన మొదటి వ్యక్తి తనే. నాకు, ఆమె జరిగిన సంభాషణను నేను మరచిపోలేను. నాకు అవసరమైన సమయంలో ఆమె మాటలు నాలో ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. నేను రాణి ముఖర్జీని దగ్గరగా గమనించాను. నేను రాణి వర్క్‌ను చాలా దగ్గరగా గమనించా ను. ఆమె గ్రేస్, ఛార్మ్, తెలివితేటలకు ముగ్ధుడినయ్యాను. రాణీ ముఖర్జీ తన 30ఏళ్ల సినీ ప్రయాణాన్ని సెలబ్రేట్ చేసుకోవటం నిజంగా అద్భుతం. రాణి ముఖర్జీ ఎప్పటికీ ప్రత్యేకమైన వ్యక్తిగా నేను భావిస్తాను. భారత దేశంలోని గొప్ప నటీమణుల్లో ఆమె ఒకరు. మన ఇండస్ట్రీ ఏంటో ఆమె తన పనితనంతో నిర్వచించారు. ఆమె ఎంచుకునే సినిమాలు, పాత్రలు ఇప్పుడు స్క్రీన్‌పై మహిళలను చూపించే విధానాన్ని మార్చాయి. రాణీ తన సినిమాలతో ప్రేక్షకులను మెప్పించాలనుకున్నారు.



# ఎట్టకేలకు అసలు విషయం బయటపెట్టిన సింగర్



బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ మళ్ళీ వార్తల్లో నిలిచింది. ఈసారి తన సినిమాల కంటే వ్యక్తిగత విషయాల వల్లనే నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. టైగర్ ష్రాఫ్‌తో లాంగ్ రిలేషన్‌షిప్‌కు బ్రేక్ పడిన తర్వాత, ఈ భామ పంజాబీ పాప్ సింగర్ తల్వీందర్ సింగ్‌తో ప్రేమలో ఉందంటూ గత కొన్ని రోజులుగా బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. కృతి సనన్ సోదరి నుపుర్ సనన్ పెళ్లి వేడుకల్లో దిశా, తల్వీందర్ జం టగా సందడి చేయడంతో ఈ పుకార్లు షికారు చేశాయి. వీరిద్దరూ కలిసి దిగిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడి యాలో వైరల్ అవ్వడంతో, దిశా కొత్త ప్రియుడు ఇతడేనంటూ నెటిజన్లు ఫిక్స్ అయిపోయారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న తల్వీందర్ సింగ్ (ɹజీశ్రీలితినిటవతీ ుాతినిణష్ట్ర)ఈ వార్తలపై ఘాటుగానే స్పందించాడు. "మాపై ఇంత త్వరగా అందరి దృష్టి పడుతుందని ఊహించలేదు. మేం ఒకరినొకరు పరిచయమై కొద్ది కాలమే అవుతోంది. ప్రస్తుతం ఒకరి గురించి ఒకరం తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నాం. ఇలాంటి పుకార్ల వల్ల వచ్చే ఒత్తిడిని మేం కోరుకోవడం లేదు. మా మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమే. దయచేసి తప్పుడు వార్తలు ప్రచారం చేయకండి" అని తల్వీందర్ స్పష్టం చేశాడు.అయితే, ఇంటర్వ్యూ చివరలో యాంకర్ అడిగిన ఓ ప్రశ్నకు తల్వీందర్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు మరింత ఆసక్తికరంగా మారింది. "మీకు ప్రేమపై నమ్మకం ఉందా?" అని అడగ్గా.. "నేను ప్రతిరోజూ ప్రేమిస్తూనే ఉంటాను, ఇప్పుడు కూడా ప్రేమిస్తున్నాను" అంటూ నవ్వుతూ బదులిచ్చాడు.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411